సాక్షి ప్రకాశం

ఆదివారం । 13 । జూలై । 2025



నాగవేణికి నారాయణమ్మ షాక్!

దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నాయకురాలిని కాదని, బీజేపీ నాయకురాలిని నియమించారు.

- 8లో..



ఆర్టీసీ బస్సు..బైకు ఢీ

ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పొదిలి మండలం కాటూరివారిపాలెం-అగ్రహారం గ్రామాల మధ్య శనివారం జరిగింది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
38 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రంలో పీడీ విచారణ

- బాలుడి మృతి ఘటనపై ఆరా



విచారణ చేస్తున్న పీడీ

కంభం: మండలంలోని లింగోజిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమైన బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో అధికారులు విచారణ వేగవంతం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త నిర్లక్ష్యంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ శుక్రవారం రాత్రి లింగోజిపల్లి గ్రామానికి వచ్చి సుమారు 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. కేంద్రం నుంచి బాలుడు ఎలా వెళ్లాడు అన్న దానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను కుటుంబ సభ్యులు ఎంత బాధ్యతగా అంగన్‌వాడీ కేంద్రంలో వదిలిపెట్టి వెళ్తారో అంతే బాధ్యతగా సిబ్బంది వారిని ఇంటికి చేరేలా చూసుకోవాలన్నారు. బాలుడి ఘటనపై విచారణ జరిపామని, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రారంభమైన 8వ రౌండ్ పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నుంచి 8వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైంది. ఇప్పటి వరకు గిట్టుబాటు ధర దక్కక అధిక సంఖ్యలో బేళ్ల తిరస్కరణకు గురవుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలానికి తీసుకొచ్చిన అన్ని బేళ్లను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర దక్కేలా వ్యాపారులు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

359 బేళ్ల తిరస్కరణ:

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 359 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఇన్చార్జి వేలం నిర్వహణ అధికారి ఎం.సత్య శ్రీనివాస్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1241 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వివిధ కారణాలతో 359 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.221.58 గా నమోదైంది.

- సంద్రంలో నిరాశాజనకంగా చేపలవేట
- అరకొరగా వలకు చిక్కుతున్న మత్స్య సంపద
- చాకిరి తప్ప ఆదాయం లేదంటున్న గంగపుత్రులు
- మార్కెట్లో నేలచూపులు చూస్తున్న ధరలు
- సోనాబోట్ల దాడులతో భయంగా మారిన వేట



పాకల తీరంలో వేట లేక ఆగిన బోట్లు

చేప చిక్కక.. బతుకు నావ సాగక!

కడలిని నమ్ముకున్న గంగపుత్రులకు జీవనం భారంగా మారింది. వేట నిషేధం ముగిసింది. చేపల వేటకు వెళ్దాం లాభాలు ఆర్జిద్దాం అని ఆశపడిన మత్స్యకారుల ఆశలు అడియాసలయ్యాయి. దాదాపు నెల రోజులుగా సంద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వారి బతుకులు తలకిందులవుతున్నాయి. సముద్రంలో కిలోమీటరు దూరం వెళితే పుష్కలంగా మత్స్య సంపద లభ్యమయ్యే కాలం. అందుకు భిన్నంగా ఉన్నాయి ప్రస్తుత పరిస్థితులు. మూడు, నాలుగు కిలో మీటర్లు ప్రయాణించి.. వలలు వేసి గంటల తరబడి నిరీక్షించినా చేపలు చిక్కడం లేదు. మార్కెట్లో ధరలు నేల చూపులు చూస్తున్నాయి. తమిళనాడు సోనాబోట్ల దాడులతో వారి బతుకునావ తిరగబడుతోంది.

సింగరాయకొండ:

సముద్రంలో చేపలు గుడ్లుపెట్టే సమయమైన ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకూ చేపల వేట నిషేధాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. రెండు నెలల పాటు వేటకు విరామం కావడంతో మత్స్యకారులు ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో వారికి పనులు దొరకడం కష్టంగా మారింది. అప్పులు చేసి కడుపులు నింపుకోవాల్సి వస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో మత్స్య సంపద పుష్కలంగా లభిస్తుంది. అయితే ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పడవలు బోల్తాపడిపోతున్నాయి. కష్టపడి రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణించినా చేపలు అరకొరగా లభిస్తున్నాయి. తెల్లవారు జామున వేటకు వెళ్లి గంటల తరబడి వేచి చూసినా చేపలు చిక్కడం లేదు. కనీసం డీజిల్ డబ్బులు కూడా రావడం లేదని మత్స్యకారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగని వేటతో అవస్థలు:

జిల్లాలోని తీరప్రాంతం కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలో 1,503 బోట్లు ఉన్నాయి. వీటిలో ఇంజన్ బోట్లు 1,111 ఉండగా, తెప్ప పడవలు 392 ఉండగా సుమారు 5,800 మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రతి సంవత్సరం వేట నిషేధం తరువాత చేపల వేటకు వెళితే ప్రతిరోజూ రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చేపలు దొరికేవి. కొన్ని సందర్భాల్లో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు విలువైన చేపలు దొరికేవి. నేడు పరిస్థితి దారుణంగా ఉందని రూ.2 వేలు విలువ జేసే చేపలు కూడా దొరకడం లేదని, నెలరోజుల్లో కేవలం ఒకటి లేక రెండు రోజులు మాత్రమే రూ.10 వేలు విలువచేసే చేపలు దొరికాయని వారు చెబుతున్నారు. ప్రస్తుతం లభిస్తున్న మత్స్య సంపదతో డీజిల్ ఖర్చులు కూడా రావటం లేదని ఇలాగైతే ఎలా బతకాలో అర్థం కావటం లేదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

డీజిల్ ఖర్చులు కూడా రావటం లేదు

వేట నిషేధం తరువాత వాతావరణ పరిస్థితుల కారణంగా దాదాపు 10 రోజుల పాటు చేపల వేటకు వెళ్లలేదని మత్స్యకారులు తెలిపారు. తరువాత వేటకు వెళితే ఎక్కువ సార్లు రూ.2 వేల నుంచి రూ.4 వేలు విలువచేసే చేపలు పడుతున్నాయి. వాస్తవానికి ఒక బోటు చేపల వేటకు వెళితే సుమారు రూ.2 వేలు ఖర్చవుతుంది. ఆ మొత్తం పోను అదనంగా వస్తేనే మాకు ఆదాయం అంటున్నారు. ఒక బోటుకు యజమానితో కలిపి మొత్తం ఆరుగురు వెళతారు. వేట చేయగా వచ్చిన ఆదాయాన్ని రెండు భాగాలు చేస్తామని, ఒక భాగం యజమానికి ఇచ్చి మిగతా మొత్తాన్ని ఐదుగురు పంచుకుంటామని మత్స్యకారులు తెలిపారు. ఒక వేళ ఆ రోజుకు కేవలం రూ.3 వేలు వస్తే అందులో రూ.2 వేలు యజమానికి పోను మిగిలిన వెయ్యి పంచుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా వేటకు వెళితే రూ.2 వేలు కూడా రావటం లేదని దీంతో కొత్తపట్నం ప్రాంతంలో చేపల వేటకు వెళ్లడం లేదని వారు తెలిపారు.

సోనా బోట్లతో దోచేస్తున్నారు..

అరకొరగా లభ్యమవుతున్న మత్స్య సంపదను తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన జాలర్లు సోనాబోట్లతో వచ్చి దోచుకుపోతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సోనాబోట్లతో వచ్చి నిబంధనలకు విరుద్ధంగా తీరంలో వేటసాగిస్తున్నారని చెబుతున్నాయి. తీరం సమీపంలో వేటాడటంతో వలలు తెగిపోయి వేలాది రూపాయలు నష్టపోతున్నామని, ఇటీవల కాలంలో పాకల, ఊళ్లపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులకు చెందిన వలలు సుమారు రూ.5 లక్షల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేట లేక అల్లాడుతుంటే సోనాబోట్ల దాడులతో పరిస్థితి మరింత దారుణంగా మారిందంటున్నారు.

చేపల ధరలు పతనం

ఆషాఢమాసంలో చేపల ధరలు ఆశాజనకంగా ఉంటాయి. ఈ సమయంలో గుజరాత్, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో చేపల వేట నిషేధం. దీంతో ఈ సమయంలో రకాన్ని బట్టి చేపలు కేజీ ధర రూ.400 నుంచి రూ.600 వరకూ పలుకుతాయి. అదే ఇతర నెలల్లో కేజీ ధర రూ.200 నుంచి రూ.300 మధ్య ఉంటుంది. అంతేకాక ఈ సమయంలో చేపలు కూడా బాగా లభిస్తాయి. అలాంటిది ఈ సంవత్సరం వేట దారుణంగా ఉంది. ధరలు కూడా పతనమయ్యాయి. ఇక ఆగస్టు నుంచి శ్రావణమాసం ప్రారంభమైతే అన్ని రాష్ట్రాల్లో చేపల వేట సాగి ధరలు తగ్గిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదు:



సముద్రంలో చేపల వేట బాగా లేదు. ప్రతి రోజు రెండు నుంచి మూడు వేల రూపాయల విలువైన చేపలు మాత్రమే లభిస్తున్నాయి. ఒక్కోసారి అవికూడా పడట్లేదు. దీంతో డీజిల్ ఖర్చులు కూడా రావటం లేదు. ఒక బోటు వేటకు లోపలికి వెళ్లిందంటే సుమారు కూలీ ఖర్చులు కాకుండా డీజిల్ ఖర్చులు రూ.1,600 వరకు అవుతుంది.

– సైకం దేవేందర్, మత్స్యకారుడు, పాకల

పాత రోజులు ఎప్పుడు వస్తాయో..



గతంలో వేటనిషేధం తరువాత వేటకు వెళితే రూ.30 నుంచి రూ.50 వేల విలువైన చేపలు దొరికేవి. ఒక్కోసారి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల విలువైన చేపలు లభించేవి. కానీ ఇప్పుడు రూ.2 వేల నుంచి రూ.4 వేల విలువైన చేపలు లభిస్తున్నాయి. పాత రోజులు ఎప్పుడు వస్తాయో అర్థం కావటం లేదు.

– సైకం రవి, మత్స్యకారుడు, పాకల



పాకల తీరంలో వేటకు వెళ్లిన తరువాత వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు

టీడీపీ కార్యాలయంలో ప్రజా వేదిక



టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

యర్రగొండపాలెం: టీడీపీ కార్యాలయంలో అధికారులతో ప్రజా వేదిక నిర్వహించిన ఘటన యర్రగొండపాలెంలో శనివారం జరిగింది. ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించుకోవటానికి ప్రభుత్వం ప్రజా వేదిక ఏర్పాటు చేసింది. ఈ ప్రజా వేదిక రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు అందుబాటులో ఉండేలా పంచాయతీ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల్లో అన్ని శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో నిర్వహించాల్సి ఉంది. అయితే శనివారం ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఏకంగా టీడీపీ కార్యాలయంలోనే తమ కార్యకలాపాలు సాగించారు. నియోజకవర్గంలో ఎటువంటి అర్హత లేని కూటమి నాయకుడి సమక్షంలో వేదికపై టీడీపీ నాయకులను కలుపుకొని ఈ ప్రజా వేదిక నిర్వహించి విస్మయానికి గురిచేశారు. కేవలం టీడీపీ వర్గీయులకు చెందిన వారి సమస్యలు పరిష్కరించేలా ఈ వేదిక తోడ్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇతర వర్గాలకు చెందిన వారు తమ సమస్యలను ఏ విధంగా అక్కడికి వెళ్లి వివరించగలుగుతారని వారు ప్రశ్నించారు. ప్రజా సమస్యలకు టీడీపీ కార్యాలయంలో న్యాయం జరుగుతుందా అని వారు అనుమానం వ్యక్తం చేశారు. సమస్యలతో కూడిన అర్జీలను ప్రజల నుంచి కూటమి నాయకుడు తీసుకొని ఆ సమస్యలపై ఆయనే చర్చించడం గమనార్హం. వేదిక వద్ద ఆశీనులైన టీడీపీ నాయకులు తెల్లరంగు దుస్తులు ధరించి ఉంటే ఎంపీడీవో మాత్రం పచ్చరంగు తలపించేలా బిస్కెట్ కలర్ దుస్తులు ధరించి ఆ పార్టీపై ఉన్న తన స్వామి భక్తిని చాటుకున్నారు.

స్వామి ఆదేశించారు.. అధికారులు పాటించారు..

- వేంపాడులో వేణుగోపాలస్వామి ఆలయ భూమి వేలంలో మాయాజాలం
- టీడీపీ నేత ఆక్రమించిన ఆలయ భూమి వదలి వేలం నిర్వహణ
- వేలాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- మంత్రి స్వామి ఒత్తిడితో ఆక్రమిత భూమి వదిలి మళ్లీ వేలం నిర్వహణ
- వేలం దక్కించుకున్న వారికి కాకుండా టీడీపీ సానుభూతిపరుడికి భూమి అప్పగింత



వేలం నిర్వహణ దగ్గర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్న టీడీపీ నాయకులు

పొన్నలూరు: మంత్రి ఇలాకాలో తెలుగు తమ్ముళ్ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఆయన అండతో అధికారులను పావుగా వాడుకొంటూ అక్రమాలకు తెగబడుతున్నారు. ఆఖరికి దేవుని భూములను సైతం స్వాహా చేసేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వేంపాడులో సర్వే నంబర్ 79లో 9.98 ఎకరాలు, చతుకుపాడులో సర్వే నంబర్ 69లో 27 ఎకరాలు, సర్వే నంబర్ 47/1లో 44 సెంట్లు వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములున్నాయి. వీటిని కౌలుకిచ్చేందుకు ఏటా బహిరంగ వేలం నిర్వహిస్తారు. వచ్చిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా వేణుగోపాలస్వామి దేవస్థాన భూముల వేలం నిర్వహించడానికి దేవదాయశాఖ అధికారులు నిర్ణయించారు. శనివారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని దేవదాయశాఖ అధికారి పి.అన్నమ్మ కరపత్రం విడుదల చేశారు. చతుకుపాడులో సర్వే నంబర్ 47/1 లోని 44 సెంట్ల భూమిని వదిలేసి మిగతా రెండు నంబర్లలోని భూముల వేలం నిర్వహణకు సిద్ధమయ్యారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ భూమికి వేలం ఎందుకు నిర్వహించడంలేదని నిలదీశారు. స్థానిక టీడీపీ నేత ఆ భూమిని ఆక్రమించుకోవడంతో అధికారులు ఆ భూమిని వదిలి వేలం నిర్వహించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మంత్రి స్వామి ఒత్తిడితో..

సర్వే నంబర్ 47/1లోని 44 సెంట్ల భూమిపై గ్రామస్తులు నిలదీయడంతో వేలం నిర్వహణాధికారి అన్నమ్మ సర్వే చేయించి మరోసారి ఆ భూమికి కూడా వేలం నిర్వహిస్తామని తెలిపారు. దీనికి గ్రామస్తులు లిఖితపూర్వకంగా రాసి ఇస్తే ఒప్పుకుంటామని చెప్పగా.. అందుకు వేలం నిర్వహణాధికారి ఒప్పుకోలేదు. ఈక్రమంలో అధికారులు వేలాన్ని నిలిపేసేందుకు ప్రయత్నించారు. అయితే ఇంతలో టీడీపీ నాయకులు విషయాన్ని మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారని, మంత్రి స్వామి అధికారులకు ఫోన్ చేసినట్లు చేసి వేలాన్ని కొనసాగించాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకుని, ప్రశ్నించిన గ్రామస్తులపై కేసులు పెట్టిస్తామని బెదిరించి టీడీపీ నాయకులు చెప్పినట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. టీడీపీ నాయకుడు ఆధీనంలో ఉన్న 44 సెంట్ల భూమిని వదిలేసి మిగిలిన రెండు సర్వే నంబర్లలోని భూములకు వేలం నిర్వహించారు.

టీడీపీ సానుభూతిపరుడికి అప్పగింత

వేంపాడు వేణుగోపాలస్వామి దేవాలయ భూముల వేలం నిర్వహణలో అంతా మాయాజాలం నడిచింది. వేలం నిర్వహణలో భూమి దక్కించుకున్న గ్రామస్తునికి భూమి అప్పగించకుండా మంత్రి స్వామి ఒత్తిడితో టీడీపీ సానుభూతిపరుడికి అప్పగించారు. వాస్తవంగా సర్వే నంబర్ 79 లోని 9.98 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన దాసరి ఏడుకొండలు రూ.2.53 లక్షలకు దక్కించుకున్నారు. అయితే ఈ నగదును చెల్లించడానికి మూడు రోజుల సమయం ఉన్నా స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు వెంటనే చెల్లించాలని అధికారులు డిమాండ్ చేశారు. అయితే రెండు రోజులు బ్యాంకుకు సెలవు కావడంతో సోమవారం డబ్బులు మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పాడు. దీనికి ఒప్పుకోని అధికారులు వేలంలో రెండో స్థానంలో నిలిచిన టీడీపీ సానుభూతిపరుడికి ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే భూమిని దక్కించుకున్నట్లు ప్రకటించిన టీడీపీ సానుభూతిపరుడు వెంటనే రూ.2.53 లక్షలు చెల్లించకపోవడం కొసమెరుపు.



వేంపాడులో పోలీసుల సహకారంతో వేలం నిర్వహిస్తున్న అధికారులు

మోసం చేయడంలో బాబు దిట్ట



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, అన్నా రాంబాబు, బత్తుల, జంకె



కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- పొదిలి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు
- అధికారంలోకి వస్తే దెబ్బకు దెబ్బ తీస్తాం .. ఎవ్వరినీ వదిలిపెట్టం
- వైఎస్సార్ సీపీ నాయకులు బూచేపల్లి, అన్నా, బత్తుల, జంకె

మార్కాపురం: ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు లెక్కలు కట్టి సంతకాలు పెట్టి ప్రజలకు కూటమి నాయకులు ష్యూరిటీ బాండ్లు ఇచ్చారని, అవి ఇప్పుడు ఎక్కడ పూర్తిస్థాయిలో అమలవుతున్నాయో అర్థంకావడం లేదని, కళ్లార్పకుండా మోసం చేయడంలో బాబు దిట్ట అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని బీ కన్వెన్షన్ హాలులో శనివారం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ.. కార్యక్రమాన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనాలో కూడా ఇచ్చిన హామీలన్నీ అమలుచేయగా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం మాత్రం ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలుచేయలేకపోయిందని విమర్శించారు. గత నెలలో పొదిలి పట్టణంలో పొగాకు రైతుల కోసం జగన్‌మోహన్‌రెడ్డి రాగా టీడీపీ వారు రాళ్లువేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారన్నారు. ఆ సభకు స్వచ్ఛందంగా వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు రావడంతో తట్టుకోలేక పోయిన కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తాము దేన్నీ మర్చిపోమని, దెబ్బకుదెబ్బ తీస్తామని, ఎవరినీ వదిలేది లేదన్నారు. కార్యకర్తలెవరూ అధైర్య పడవద్దని, ఏ సమస్య వచ్చినా అన్నా రాంబాబుతో పాటు తాము కూడా అండగా ఉంటామని స్పష్టం చేశారు. జగన్ 2.0లో కార్యకర్తలకు అగ్రస్థానం ఉంటుందని, కార్యకర్తలే పార్టీకి ప్రాణమన్నారు.

అధికారం శాశ్వతం కాదు.. దుర్మార్గపు చర్యలు మానుకోండి:

టీడీపీ నాయకులు అధికారం శాశ్వతమనుకుంటున్నారని, ఇప్పటికైనా దుర్మార్గపు చర్యలు మానుకొని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని మంచి పనులకు ఉపయోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు హితవు పలికారు. పొదిలి సంఘటనలో అన్యాయంగా కేసులు పెట్టి జైల్లో వేశారని, ఆ కుటుంబాల ఉసురు కచ్చితంగా వారిపై తప్పుడు కేసులు పెట్టించిన నాయకులకు తగులుతుందని, ఇలా ప్రోత్సహించిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తామని అన్నారు. ఎన్నికల హామీలను అమలుచేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తప్పుడు విధానాలు, కేసులతో ఇబ్బంది పెట్టడం మంచిదికాదన్నారు. మార్కాపురం జిల్లా, మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించేలా, వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యేకు సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నేతలకు, ఎమ్మెల్యేకు లేదన్నారు. కార్యకర్తలెవరూ భయపడవద్దని, రెచ్చగొట్టినా సంయమనంతో ఉండాలని అన్నారు. చంద్రబాబు వచ్చివెళ్లిన తరువాత ఊరూరా బెల్టుషాపులు ఎక్కువయ్యాయన్నారు.

వంద శాతం మోసం గ్యారంటీ:

2014, 2024లో అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి ఈవీఎంల సహకారంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలను అమలు చేయకుండా వందశాతం మోసం చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. కూటమి ప్రభుత్వం కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేసినా భయపడేది లేదన్నారు. కార్యకర్తలకు జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే జగన్ పర్యటనలు:

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పర్యటనలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. జగన్ పర్యటనల తరువాతనే పొగాకు, మిర్చి, మామిడి రైతులకు న్యాయం జరిగిందని చెప్పారు. ఇటీవల ఆయన పర్యటనలో వస్తున్న అశేష జనవాహినిని చూసి ఢిల్లీ స్థాయిలో చర్చ జరుగుతోందన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును మాత్రం పూర్తిచేయలేదన్నారు. ఇటీవల సీఎం, డిప్యూటీ సీఎం మార్కాపురం వచ్చినప్పటికీ అభివృద్ధికి సంబంధించి ఎటువంటి హామీలు ఇవ్వలేదన్నారు. టీడీపీ కార్యకర్తల్లోనే బాబు హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు.

అందరికీ సమాధానం చెబుతాం:

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల కోసం పొదిలి వస్తే ఆ సభ విజయవంతం అయ్యేసరికి తట్టుకోలేక కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. అంతకంత సమాధానం చెబుతామన్నారు. మీదార్లోనే మేం కూడా వస్తామని ఆయన అన్నారు. హామీలు అమలు చేయకుండా కాలం గడుపుతున్న చంద్రబాబు తీరును గట్టిగా విమర్శించారు.

సమావేశంలో అన్నా కృష్ణచైతన్యతోపాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలైన వెన్నా హనుమారెడ్డి, షంషేర్ అలీబేగ్, కేవీ రమణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైవీరావు, చెంచిరెడ్డి, వనజాక్షి, బండి లక్ష్మీదేవి, మురారి వెంకటేశ్వర్లు, మెట్టు వెంకటరెడ్డి, ధర్మానాయక్, ఉస్మాన్, జీ శ్రీనివాసులు, నరసింహారావు, నారు బాపన్‌రెడ్డి, మురళీకృష్ణయాదవ్, గొలమారి శ్రీనివాసరెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, పత్తి రవిచంద్ర, అక్కిదాసరి ఏడుకొండలు, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, మేడ బద్రీనాథ్, పీఎల్‌పీ యాదవ్, ఉడుముల రామనారాయణరెడ్డి తదితరులు ×బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ×పై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జీ రాజేంద్రప్రసాద్, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, సాయి రాజేశ్వరరావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మగ్బుల్ బాషా, అంజమ్మ శ్రీనివాసులు, ఉడుముల కోటిరెడ్డి, కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, ఉత్తమ్‌కుమార్, సలీమ్, బొగ్గరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను అన్నా రాంబాబు తదితరులు ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి


ఘటన స్థలంలో అంజమ్మ మృతదేహం

పామూరు: ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాలీ టైరు కిందపడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన పామూరు మండలంలోని తిరగలదిన్నె గ్రామం వద్ద 565వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీఎస్ పురం మండలం కంభంపాడు గ్రామానికి చెందిన మేకల అంజమ్మ (49) ఇసుక ట్రాక్టర్ పనికి వెళ్లింది. మండలంలోని తిరగలదిన్నెవద్ద నుంచి గోపాలపురంకు ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్.. తిరగలదిన్నె వద్ద 565వ నంబర్ జాతీయ రహదారిపైకి ఎక్కే సమయంలో అదుపుతప్పింది. జాతీయ రహదారి దిగి గుంతల్లోకి ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్ర కుదుపులకు గురైంది. ఆ సమయంలో ట్రాక్టర్ ఇంజిన్‌పై డ్రైవర్ వెనుకవైపు ఉన్న చెక్కపై కూర్చున్న మేకల అంజమ్మ కింద పడగా ట్రాక్టర్ ట్రాలీ టైరు ఆమెపైగా వెళ్లింది. ఈ ప్రమాదంలో అంజమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతుని బంధువు వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. మృతురాలికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పనికి వెళ్లిన తల్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో మృతురాలి కుమారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అధిక వేగమే ప్రమాదానికి కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నాగవేణికి నారాయణమ్మ షాక్..!

- దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంలో ఊహించని పరిణామం
- నాలుగు నెలల క్రితమే టీడీపీకి చెందిన నాగవేణిని ప్రకటించిన ఆ పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి
- బీజేపీకి చెందిన నారాయణమ్మను నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు
- పేరు మార్పిస్తామని, చైర్మన్ పదవి మాదేనని అంటున్న టీడీపీ నాయకులు
- నోరు మెదపని లక్ష్మి
- మా సంగతి ఏంటంటూ మదనపడుతున్న జనసేన నేతలు


ROLE OF RESERVATION FOR THE POST OF CHAIRMEN TO THE AGRL. MARKET COMMITTEES IN PRAKASAM DISTRICT


Sl. No.	Name of the constituency	Name of the AMC	Category of reservation
1	Ongole	Ongole	BC - (General)
2	Darsi	Darsi	SC - (General)
3	Kandukur	Kandukur	OC - (Women)
4	S.N.Padu	Maddipadu (S.N.Padu)	OC - (Women)
5	Markapur	Markapur	OC - (General)
6		Podili	BC - (Women - Minority)
7	Kanigiri	Kanigiri	SC - (Women)
8	Giddalur	Giddalur	BC - (General)
9		Cumbum	OC - (General)
10	Y.Palem	Y.Palem	ST - (General)

OC - 4, BC - 3, SC - 2, ST - 1 = Total : 10

Collector & District Magistrate, Prakasam District

దర్శి ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయిస్తూ తొలుత విడుదల చేసిన ఉత్తర్వులు





సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి నియామకంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ పదవికి టీడీపీ నాయకుడు దారం సుబ్బారావు సతీమణి, దర్శి మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ అయిన దారం నాగవేణిని ఎంపిక చేసినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి నాలుగు నెలల క్రితమే ప్రకటించారు. దీంతో దారం సుబ్బారావు, నాగవేణి దంపతులు మార్కెట్ చైర్మన్ పేరుతో అనేక కార్యక్రమాలకు ఫ్లెక్సీలు కూడా పెట్టుకున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవి దక్కుతుందనే ఉత్సాహంతో టీడీపీ కార్యక్రమాలకు భారీగా డబ్బు కూడా ఖర్చు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా నాయకుడు, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసరావు సతీమణి నారాయణమ్మను దర్శి ఏఎంసీ చైర్మన్‌గా నియమిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం అకస్మాత్తుగా విడుదల చేసిన జాబితాలో దర్శి ఏఎంసీ చైర్మన్‌గా బీజేపీకి చెందిన నారాయణమ్మ పేరు ఉండటంతో ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తుండగా, టీడీపీ శ్రేణులు, నాగవేణి వర్గీయులు షాక్‌కు గురయ్యారు.

గొట్టిపాటి లక్ష్మిపై తీవ్ర అసంతృప్తి...

దర్శి ఏఎంసీ చైర్మన్ పదవిని తొలుత ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించారు. గొట్టిపాటి లక్ష్మి చక్రం తిప్పి దానిని ఓసీగా మార్పించి కాపు సామాజికవర్గానికి చెందిన దారం నాగవేణిని ప్రకటించారు. అప్పటి నుంచి ఎస్సీ సామాజిక వర్గం వారు తమకు వచ్చిన అవకాశాన్ని తమకు దక్కకుండా చేసిన గొట్టిపాటి లక్ష్మిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీ కోసం కష్టపడిన ఎస్సీలంతా రగిలిపోతున్నారు. కానీ, చివరకు బీజేపీకి చెందిన బీసీ సామాజికవర్గ మహిళ మాడపాకుల నారాయణమ్మ పేరును ప్రభుత్వం ఫైనల్ చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి రెండు రోజులుగా నోరు మెదపకపోవడంతో టీడీపీ శ్రేణులు కూడా ఆమె తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు ప్రెస్‌మీట్ పెట్టి బీజేపీకి ఏఎంసీ చైర్మన్ పదవి కేటాయించినందుకు గొట్టిపాటి లక్ష్మికి ధన్యవాదాలు తెలపడంతో లక్ష్మిపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆమె గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. దీనిపై ఆమె స్పందించకపోవడం, పేరు మార్పు ప్రచారం గురించి స్పష్టత ఇవ్వకపోవడంతో బీజేపీ వారికే బలం చేకూరినట్లయింది. నాలుగు నెలల క్రితమే తమ పేరు ప్రకటించినప్పటికీ పదవి దక్కకపోవడంపై టీడీపీ నాయకులు, దారం వర్గీయులు ఆగ్రహంతో ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదమని, పేరు మార్చడం ఖాయమని ప్రచారం...

ప్రభుత్వం విడుదల చేసిన ఏఎంసీ చైర్మన్ల జాబితాలో దర్శికి సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం వలన పేరు పొరపాటు పడిందని, నాగవేణికే చైర్మన్ పదవి కేటాయిస్తూ మార్పులు జరగడం ఖాయమని దారం సుబ్బారావు వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ నాయకులు మాత్రం తమ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్, మాజీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఒత్తిడి మేరకు బీజేపీ కోటా కింద దర్శి ఏఎంసీ పదవిని నారాయణమ్మకు కేటాయించారంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి కూడా తమకు సహకరించారంటూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ ధన్యవాదాలు తెలిపారు.

ఇష్టారాజ్యంగా రిజర్వేషన్ల ఉల్లంఘనలు...

- మండిపడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకంలో కూటమి పాలకులు ఇష్టారాజ్యంగా రిజర్వేషన్లు ఉల్లంఘించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ జీవో నంబర్ 77 విడుదల చేశారు. ఇప్పుడు కూడా దాని ప్రకారమే ఏఎంసీ చైర్మన్లను నియమించాలని కలెక్టర్ల ద్వారా ఉత్తర్వులిచ్చిన కూటమి పాలకులు.. ఆచరణలో మాత్రం ఎక్కడా పాటించకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాది పాటు రిజర్వేషన్లను సడలిస్తున్నట్లు ఎక్కడికక్కడ జీవోలు విడుదల చేసి రిజర్వేషన్లకు తూట్లు పొడిచినట్లు సమాచారం. తద్వారా తమకు ఇష్టమొచ్చిన నాయకులు, తమను సంతృప్తిపరిచిన నాయకులు, గత ఎన్నికల్లో తమ కోసం భారీగా ఖర్చు చేసిన వారికి ఏఎంసీ చైర్మన్ పదవులు కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. చైర్మన్ల నియామకాలకు సంబంధించిన రిజర్వేషన్లపై జీవో నంబర్ 77ను ఇటీవల కలెక్టర్ విడుదల చేశారు. దాని ప్రకారం యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్టీకి రిజర్వ్ అయింది. కానీ, కూటమి పాలకులు టీడీపీ సామాజికవర్గానికి చెందిన చేకూరి సుబ్బారావు పేరు ప్రకటించారు. అలాగే, పొదిలి చైర్మన్ పదవిని బీసీ మహిళ (మైనారిటీ)కు రిజర్వ్ చేశారు. కానీ, ఇక్కడ బీసీ జనరల్‌కు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కనిగిరిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కనిగిరికి ఎస్సీ మహిళను రిజర్వ్ చేయగా, పామూరు మండలానికి చెందిన యారవ శ్రీనివాసులచౌదరిని తొలుత చైర్మన్‌గా ప్రకటించారు. ఆ తర్వాత అతని సతీమణి పేరును ప్రకటించారు. ఎస్సీ మహిళకు కేటాయించిన ఈ స్థానంలో ఓసీని ఎలా నియమిస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్లు మార్చడం రాజ్యాంగ విరుద్ధమని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలనుకుంటే కేబినేట్లో నిర్ణయం తీసుకోవాలని విశ్లేషకులు అంటున్నారు. రిజర్వేషన్లకు భిన్నంగా ఏఎంసీ చైర్మన్ల నియామకాలపై ఎస్సీ, ఎస్టీలు మండిపడుతున్నారు.

జనసేన నాయకుల నైరాశ్యం...

ఇదిలా ఉండగా, దర్శి ఏఎంసీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకుని ఉన్న జనసేన నాయకులు నైరాశ్యానికి గురయ్యారు. బీజేపీ కంటే ఎక్కువ శాతం ఓట్లు జనసేనకు ఉన్నాయని, తమ మద్దతుతోనే టీడీపీకి బలం చేకూరుతుందని, కానీ, తమకెందుకు ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వకూడదని జనసేన పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. జనసేనకు ఇన్‌చార్జ్‌గా ఉన్న నేతలెవరూ ఇక్కడకు రాకపోవడం, తమ పార్టీ వారికి ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలని అడగకపోవడంతో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి నియామకంతో నియోజకవర్గంలో రాజకీయ దుమారం లేచిందని, కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు 3 లక్షల మంది దూరం

- కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఈ ఏడాది తగ్గిన విద్యార్థుల అడ్మిషన్లు
- ఉపాధ్యాయులపై యాప్‌ల భారం.. విద్యార్థులకు బోధన దూరం
- తల్లిదండ్రుల విశ్వాసాన్ని కోల్పోయేలా చేసిన కూటమి ప్రభుత్వం
- ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అనుసరిస్తున్న పాలకులు
- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ ధ్వజం


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

చీమకుర్తి: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పోయిందని, ఫలితంగా ఈ ఏడాది 3 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. చీమకుర్తిలో శనివారం నిర్వహించిన యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ మండల విద్యా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను విద్యారంగంపై రుద్దుతోందన్నారు. రెండేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను అప్పటి ప్రభుత్వం హైస్కూళ్లకు పంపించిందని, వారికోసం పదోన్నతుల పేరుతో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా నియమించిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం హైస్కూళ్లలో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపించిందన్నారు. అలాగే, విద్యార్థులు తక్కువగా ఉన్నారంటూ హైస్కూళ్లలో ఇటీవల పదోన్నతులు పొందిన స్కూలు అసిస్టెంట్లను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపించిందని తెలిపారు. అంతేతప్ప కూటమి ప్రభుత్వం విద్యారంగంలో కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలు ఏమీ లేవన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఈ సంవత్సరం 3 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారన్నారు. అమ్మ ఒడి, నాడు–నేడు ఆధునికీకరణతో కోవిడ్ సమయంలో ప్రైవేటు పాఠశాలల నుంచి 6 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోకి వచ్చారన్నారు. నేడు తల్లికి వందనం వలన విద్యార్థుల హాజరు శాతం పెరగకపోగా, పలు రకాల యాప్‌ల భారం కారణంగా ఉపాధ్యాయులపై తీవ్రమైన పని ఒత్తిడి పెరిగి విద్యార్థులు నాణ్యమైన బోధనకు దూరమవుతున్నారన్నారు. దానివలన విద్యార్థుల తల్లిదండ్రులలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలు, పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, 11వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని కోరారు.

యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలలో ఉపాధ్యాయుల జీతాల సమస్యలు రాకుండా పొజిషన్ ఐడీలు, క్యాడర్ స్ట్రెంగ్త్‌లను వెంటనే తెప్పించాలన్నారు. తొలుత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సాంస్కృతిక సేవా కార్యక్రమాలలో యూటీఎఫ్ జిల్లా శాఖ నిర్వహిస్తున్న పాత్రను అభినందించారు. తొలుత యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరించారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలపై వెళ్లిన వారిని యూటీఎఫ్ మండల శాఖ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌హై, డీ వీరాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే అక్బర్, చలువాది శ్రీనివాసరావు, యుటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు – బైకు ఢీ


ప్రమాదానికి కారణమైన బస్సు


నుజ్జునుజ్జయిన బైకు


నెహేమియా మృతదేహం

- ఒకరు మృతి

పొదిలి రూరల్: ఆర్టీసీ బస్సు – బైకు ఢీకొని బైకుపై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని కాటూరివారి పాలెం–అగ్రహారం గ్రామాల మధ్య ఒంగోలు–కర్నూలు రహదారిపై శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మర్రిపూడి మండలం శివరాయునిపేటకు చెందిన మోమిడి నెహేమియా (32) తన ద్విచక్ర వాహనంపై పొదిలి నుంచి ఒంగోలువైపు వెళ్తున్నాడు. మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు నుంచి మార్కాపురం వెళ్తుండగా, మార్గం మధ్యలో కాటూరివారిపాలెం సమీపంలో ఎర్రవాగు దగ్గర బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న నెహేమియాకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. మృతుడు జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పొదిలి సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

22 నుంచి ఎలక్ట్రికల్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఈ నెల 22 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకూ 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9573363141 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దళితులకు రక్షణ కరువు

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి విమర్శ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, దళితులకు రక్షణ లేకుండా పోయిందని కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆరోపించారు. స్థానిక ఎల్బీజీ భవనంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై దాడులు జరుగుతున్నా తగిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం.. నేరస్తులకే అండగా నిలుస్తోందని విమర్శించారు. దళితులపై జరుగుతున్న అమానవీయ దాడులపై నిర్వహించాల్సిన మానిటరింగ్ కమిటీ సమావేశాలను సక్రమంగా జరపకపోవడం విచారకరమన్నారు. అసలు మానిటరింగ్ కమిటీనే ఏర్పాటు చేయకపోవడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎస్సీ చైర్మన్‌గా మూడు నెలల క్రితం నియమితులైన జవహర్ చైర్మన్ హోదాలో ఇప్పటి వరకు దళితులపై దాడులు జరిగిన ప్రాంతాలను సందర్శించకపోవడం దారుణమన్నారు. ఏడాది కాలంగా దళితులపై జరిగిన దాడులపై విచారణ చేపట్టాలని మాల్యాద్రి డిమాండ్ చేశారు.

ఎస్సీలకు ఉచిత విద్యుత్‌ను నీరుగారుస్తున్న కూటమి...

కూటమి అధికారంలోకి వచ్చాక దళితులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఎస్సీలకు అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. బాబూ జగ్జీవన్‌రామ్ పేరు మీద ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని, దాన్ని నగరంలో అమలు చేయడం లేదని తెలిపారు. తమ బృందం జరిపిన పర్యటనలో ఒంగోలు నగరంలోని మామిడిపాలెం, గద్దలగుంటలో వినియోగదారుల నుంచి విద్యుత్ ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. పెంచిన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంలో ఎస్సీలకు ఎలాంటి షరతులు లేకుండా సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని అమలు చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను పగులగొట్టమంటూ పిలుపునిచ్చిన లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతాంగానికి వాడే మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద గ్రౌండ్ చేసిన 7 లక్షల మంది లబ్ధిదారులకు తక్షణమే రుణాలు మంజూరు చేయాలని, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు వృద్ధాప్య పింఛన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని మాల్యాద్రి హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం, జిల్లా నాయకులు అట్లూరి రాఘవులు, వి.మోజెస్ పాల్గొన్నారు.

నాడు పట్టాల పంపిణీ.. నేడు ఆక్రమించుకుని..!


టీడీపీ నాయకుడు ఆక్రమించి దున్నేసిన పేదల ఇళ్ల స్థలాల భూమి

పీసీ పల్లి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేయగా, నేడు కూటమి ప్రభుత్వంలో అధికార టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఆయా భూములను ఆక్రమించుకుని ఏకంగా దున్నేస్తున్నారు. పీసీ పల్లి మండల పరిధిలోని మురుగమ్మి గ్రామ పంచాయతీలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన అధికార పార్టీ నేతల అరాచకాలకు అద్దం పడుతోంది. గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ 333/6లో మొత్తం రెండెకరాలు ప్రభుత్వ భూమి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. సుమారు 46 మంది పేదలకు పట్టాలు అందజేశారు. అయితే, ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతూ పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలను కూడా వదలకుండా కాజేస్తున్నారు. అందులో భాగంగానే శని, ఆదివారాలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు చూసుకుని ఓ టీడీపీ నాయకుడు మురుగమ్మి గ్రామంలో పేదలకు ఇళ్లస్థలాలుగా ఇచ్చిన భూమిని దర్జాగా కబ్జా చేశాడు. శనివారం సంబంధిత భూమిని ఏకంగా దున్నేశాడు. పంటలు సాగుచేసేందుకు సిద్ధం చేస్తున్నాడు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మురుగమ్మి గ్రామంలోని ఓ టీడీపీ నాయకుడు సచివాలయ శిలాఫలకాన్ని పగలగొట్టాడు. మరికొంత మంది నాయకులు అందినకాడికి దోచుకుందామంటూ అటవీ, పోరంబోకు, రెవెన్యూ భూములపై పడి రాత్రికిరాత్రి లారీలకు లారీల తెల్లరాయిని తరలిస్తున్నారు. వీటన్నింటినీ మరవకముందే తాజాగా పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసిన భూములను ఆక్రమించుకోవడంతో టీడీపీ నేతల దౌర్జన్యాలపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.